## జర జాగ్రత్త

2వ పేజీ కొరవ

కొన్ని గ్రామాలకు, కొందరు రైతులకు శాశ్వతంగా నీరు అందకుండా పోయే ప్రమాదం వుంది.

బ్రాంచి కాలువల క్రింద ఆయకట్టు భూములు కల్గిన రైతులందరూ నిద్ర నుంచి మేలుకోవలసిన అవసరం చాలా వుంది. కాలువల త్రవ్వకం మొదలుకాక ముందే, సంబంధిత కార్యాలయాలకు వెళ్లి, ఏ కాలువలకు ఏ డిజైన్ ఆమోదం పొందిందో; ఏయే గ్రామాల మీదుగా దాన్ని త్రవ్వబోతున్నారో; దాని లోతు ఎంతా; అందులో తమ పంట చేల వరకు నీరు పారే వసతి వుందో, లేదో ముందుగానే తెలుసుకోవడం మంచిది. రైతులు అడిగితే సంబంధిత కాలువల డిజైన్‌లు అధికారులు ఇచ్చి తీరాలి. ఒకవేళ ఇవ్వడానికి ఇబ్బంది పెడితే, సమాచార హక్కు వుపయోగించి, డిజైన్ వివరాలు కోరవచ్చు. తమకు స్పష్టమైన సమాచారం ఇచ్చే వరకు కాలువల త్రవ్వకం మొదలు పెట్టకుండా కాంట్రాక్టర్లను నిలువరించడం చాలా ముఖ్యం. కొందరు కాంట్రాక్టర్లు తమ లాభం కోసం కాలువల పొడవు తగ్గించి వేస్తున్నారని రూఢీగా తెలుస్తున్నది. అటువంటి దుర్మార్గుల మీద ఒక కన్ను వేసి పెట్టడం రైతు కర్తవ్యం. ఎమ్మెల్యేలను నమ్ముకుని లాభం లేదు. దాదాపుగా ప్రతి ఎమ్మెల్యేకు కాంట్రాక్టర్లతో లాలూచీ వుంది. అందువల్ల వారు తమ క్షేమం చూస్తారని భ్రమపడితే, కొంపమునిగి పోతుంది రైతులే అందుకు వుద్యుక్తులు కావాలి. అవసరమైతే గ్రామాల వారీగా, రాజకీయాలతో సంబంధం లేకుండా రైతు సంఘాలు ఏర్పరచుకుని, సమష్టిగా ప్రయత్నం చేయడం మంచిది. ప్రభుత్వం చాలాకాలం తర్వాత నిధులు ఇస్తున్నది. ఒకసారి అవి దుర్వినియోగం అయితే ఇక ఈ జన్మలో మళ్లీ నిధులు రావు. ఒకసారి కాలువల పరిధి నుంచి ఆయకట్టు తగ్గిపోతే మళ్లీ చేర్పించుకోవడం జరిగే పనికాదు. మీదు భూములను మాగాణులుగా మార్చుకోవడానికి లభించిన ఈ బంగారు వంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఏ మాత్రం ఏమరు పాటు చూపినా ఆ తర్వాత చింతించి ప్రయోజనం వుండదు.

## వివాదాల కాష్టం

5వ పేజీ కొరవ

పట్టాలిచ్చిన భూములనే మళ్లీ ఇక్కడి ప్రజా ప్రతినిధి, మరికొందరు పట్టాలు పొంది దీన్ని వేరొకరికి విక్రయించడంతో వివాదం జటిలమయ్యింది. ఇస్కపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ భూములు పొందిన సంఘటనలో గ్రామంలో గొడవలు జరిగే ప్రమాదముంది. వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌కు సగానికి పైగా భూ వివాదాల కేసులే వస్తుంటాయి. వీటిని నిజాయితీగా పరిష్కరించను ఒక అధికారిని నియమిస్తే తప్ప మండలంలోని గ్రామాల్లో శాంతి భద్రతలు నెలకొనేలా లేవు.

## వలస సీమకు ఏరియా ఆస్పత్రి

వైద్య సేవలు అంతంత మాత్రంగానే వుండి వలస సీమగా పేరొందిన ఉదయగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా మార్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి రోశయ్య అంగీకరించారు. 12వతేది అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ కేంద్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు లేవని అత్యవసరమైతే ఆత్మకూరు, నెల్లూరు ఆస్పత్రులకు పోక తప్పదన్నారు. దీనిమూలంగా సామాన్యుడు వైద్యం చేయించుకోలేని పరిస్థితి వుందన్నారు. ఉదయగిరిలో ఏరియా ఆస్పత్రి పెడితే నియోజక వర్గంలోని ప్రజలతో పాటు ప్రకాశం జిల్లాలోని పామూరు, సిఎస్‌పురం, కడప జిల్లాలోని పోరుమామిళ్ల, బద్వేల్, కలవపాడు మండల ప్రజలకు అందుబాటులో వుంటుందన్నారు. శాసనసభ్యుని ఆవేదనను అర్థం చేసుకొన్నామని ఇక్కడ ఆరు కోట్ల వ్యయంతో ఏరియా ఆస్పత్రి నిర్మిస్తామని అసెంబ్లీలో రోశయ్య హామీ ఇచ్చారు. డిఎఫ్ఐడి నిధులతో ఈ ఆస్పత్రి ఏర్పాటవుతుంది. ఈ హాస్పిటల్ పనుల ప్రారంభానికి శాసనసభ్యుడు గట్టి ప్రయత్నం చేస్తే ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో గూడు కట్టుకోవడం ఖాయం.



నాయుడుపేటలోని డిఎస్ఆర్ కళ్యాణ మండపంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు. వేదికపై జిల్లా కలెక్టర్ రవిచంద్ర, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్డిఓ సుబ్రహ్మణ్యంరెడ్డి.

## ప్రాణాలు తీస్తున్న ఆటోలు

కావలిలో ఆటోలు పద్ధతిపాడు లేకుండా రోడ్ల మీద తిరుగుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కావలి నుంచి చుట్టు ప్రక్కల పల్లెలకు 300 పైగా ఆటోలు తిరుగుతున్నాయి. ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 20 మందిని కుక్కుతున్నారు. చిత్రంచర్ల, ఆనమడుగు, అడివి లక్ష్మీపురం ప్రాంతాలకు వెళ్లే ఆటోల పరిస్థితి దారుణంగా వుంటుంది. ఆటోల తాలూకు వస్తువులు ఎప్పుడు ఏమి వూడిపోతాయో తెలియని పరిస్థితి. దీంతో తరచూ ఆటోలు ప్రమాదానికి లోనవుతున్నాయి. వీటిమూలంగా కావలి చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన 50 మంది వికలాంగులయ్యారంటే పరిస్థితి ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు నెలసరి మామూళ్లు తీసుకొంటూ ఏ విషయాన్నీ పట్టించుకోవడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారి పట్ల ఇంత నిర్లక్ష్యం తగదు.

## నెల్లూరు ముచ్చట్లు

6వ పేజీ కొరవ

చూపి బాల శాస్త్రవేత్తల అవార్డులు పొందారు. కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో డిటెక్షన్ ఆఫ్ ఐరన్ ఇన్ వాటర్ ప్రాజెక్టను ప్రదర్శించిన మదన్‌మోహన్, పి.అనుదీప్, శశికిరణ్, ఎస్.రాహుల్, సి.రాహుల్ హైదరాబాద్‌తో పాటు ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మరో ప్రాజెక్టను ప్రదర్శించిన షేక్ ఫాతిమా, ఆర్.స్నేహ, జె.సింధు, ప్రతిభ, వై.దివిషా కూడా జాతీయ పోటీల్లో పాలు పంచుకోనున్నారు. పిల్లలకు రేస్ టీచర్లు ప్రిన్స్ ఫ్రాన్సిస్, టి.సుజాత గైడ్లుగా వ్యవహరించారు.

## చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు సాయం

నెల్లూరు జిల్లాలో పేద పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయిస్తున్న చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు నెల్లూరులోని దీపికాస్ గ్రాఫిక్ పాయింట్ నిర్వాహకులు 10,116 రూపాయలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని 15వతేది గ్రాఫిక్ పాయింట్ అధినేతలు ఎ.మహదేవన్, ఎ.శ్రీధర్, శ్రీమతి వాణి ఫౌండేషన్ ఛైర్మన్ కెవి రత్నంకు అందించారు.

జమీన్‌రైతు
వెంకటరమణ విలాస్ మిద్దెపైన,
పొగతోట, నెల్లూరు - 1.
ఫోన్: 2327354

City Square
Launching
CYBER SPACE
at Shamshabad - Hyderabad
CYBER SPACE
LOGIN TO LIFE
DTCP APPROVED RESIDENTIAL PLOTS
Date : 18th December 2005
Time : 10.00 a.m.
Venue : Cyber Space, Shamshabad, Hyderabad
Contact : K.V.Raghava Reddy
Mobile : 98498 88199
City Square Enterprises Pvt. Ltd.,
6-2-47, First Floor, Yeturi Towers
A.C.Guards, Hyderabad - 500 004

